సాక్షి వరంగల్

బుధవారం । 1 । నవంబర్ । 2023



గంజాయి స్వాధీనం

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

- 10లో ▸



నిర్లక్ష్యం తగదు

ఎన్నికల విధులను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని సంబంధిత శాఖ అధికారులు మంగళవారం సిబ్బందికి సూచించారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32^0 /22^0

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణ స్థితిలో ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. సాయంత్రం చలి తీవ్రత మొదలవుతుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక



రాంచరణ్

వర్ధన్నపేట: మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న శాగంటి రాంచరణ్ జూడోలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు వేణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో జూడో క్రీడలో అండర్ 14 బాలుర విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా రాంచరణ్ 25 కేజీల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచి ఎంపికైన రాంచరణ్ నవంబర్ 1 నుంచి 3 వరకు వరంగల్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. రాంచరణ్‌ను హెచ్‌ఎం వేణు, ఉపాధ్యాయులు ఉషారాణి, లింగమూర్తి, విజయ్, రాజు, శ్రీదేవి, అరుణదేవి, పీఈటీ వీరస్వామి జూడో కోచ్ ఎండీ జావీద్, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్ అభినందించారు.

నియామకం



మనోహర్, ఉపాధ్యక్షుడు

నెక్కొండ: మండల కేంద్రానికి చెందిన ఆకారపు మనోహర్‌ను తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సంఘం సిద్ధాంతానికి, నయమ నిబంధనలకు కట్టుబడి, ఆదర్శవంతమై సేవకు పునరంకితం కావాలని ఆయన కోరారు. కుమ్మరుల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చేందుకు తన వంతు పాత్ర పోషిరచి సంఘం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన అందరికి మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

నర్సంపేట: నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా అంగడి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసే దీపావళి టపాసుల షాపుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నవంబర్ 2వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తుదారులు దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, పాన్ కార్డు, సెల్ఫ్ డిక్లరేషన్ అఫిడవిట్, ఇంటి పన్ను, నల్ల పన్ను, ట్రేడ్ లైసెన్స్ 2023–24సంవత్సరానికి కట్టిన జిరాక్స్ కాఫీ, నక్ష(ప్లాన్) జిరాక్స్, పాస్ ఫొటో జత చేసి అందజేయాలని తెలిపారు.

ఏక్తా దివస్ వేడుకలు



గీసుకొండ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటనారాయణ అధ్వర్యంలో సర్దార్ వల్లాభాయ్ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఏక్తా దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ దేశానికి చేసిన సేవలు, స్వాతంత్ర సమరంలో వారు చేసిన త్యాగాలను కొనియాడారు. అనంతరం ఉద్యోగులందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు, పీఓ డాక్టర్ పద్మశ్రీ, డీఈఎంఓఎస్ అనిల్‌కుమార్, నవీన్ రాజ్‌కుమార్, ఎన్‌సీడీ స్టాఫ్ నర్సు ఆరోగ్య కార్యకర్తలు, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు



చెన్నారావుపేట: కార్మికుల సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఏఐటీయూసీ హమాలీ సంఘం అధ్యక్షుడు ఎదరబోయిన సాంబయ్య అధ్యక్షతన సంఘం 104 ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రధాన పార్టీలు కార్మికుల సమస్యల పరిష్కారానికి నిధుల కేటాయింపు మెనిఫెస్టోలో పొందు పరిచి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరస్వామి, సారంగం, కుమారస్వామి, రాజు, తదితరులు ఉన్నారు.

సార్వత్రిక పోరు.. మరింత హోరు..!



మరో రెండు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్

- అస్త్రశస్త్రాలతో సాగుతున్న పార్టీల ప్రచారం
- మూడు స్థానాల్లో బీజేపీ, ఒక్కచోట తేలని కాంగ్రెస్ అభ్యర్థులు...
- నేడో, రేపో ప్రకటించే అవకాశం....
- ఎనిమిది మంది అభ్యర్థులను ఖరారు చేసిన బీఎస్పీ
- హోరెత్తనున్న రాజకీయ పార్టీల పోరు ...

సాక్షి ప్రతినిధి, వరంగల్: సార్వత్రిక ఎన్నికల పోరు మరింత ఉధృతం కానుంది. బీఆర్‌ఎస్ మొత్తం 12 స్థానాల్లో, కాంగ్రెస్ 11 చోట్ల అభ్యర్థులను ప్రకటించింది. భారతీయ జనతా పార్టీ పరకాల, ములుగు, నర్సంపేట మినహా తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. బహుజన సమాజ్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం ఎనిమిది నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించారు. మరో రెండు రోజుల్లో (శుక్రవారం) ఎన్నికల అధికారులు నోటిఫికేషన్‌ను విడుదల చేయనుండగా.. అదే రోజు నామినేషన్ల ప్రక్రియ కూడ మొదలు కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రచారంలో ముందున్న బీఆర్‌ఎస్, అదే వరుసలోని కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు తమ వాణిని వినిపించేందుకు కొత్త పుంతలు తొక్కించడంపై దృష్టి సారించాయి. ఓటర్లను ఆకట్టుకునే అంశంపై ప్రధాన పార్టీల వ్యూహకర్తలు నిమగ్నమై ఉన్నారు.

రెండు రోజుల్లో అన్ని పార్టీలకు అభ్యర్థులు..

మొత్తం 12 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన పార్టీ బీఆర్‌ఎస్ కాగా, కాంగ్రెస్ పార్టీ డోర్నకల్, బీజేపీ పరకాల, ములుగు, నర్సంపేటలకు ఖరారు చేయాల్సి ఉంది. అలాగే బీఎస్పీ కూడా మరో నాలుగు స్థానాలను ఖాళీగా పెట్టింది. స్టేషన్ ఘన్‌పూర్‌కు తాళ్లపల్లి వెంకటస్వామి కాగా, పాలకుర్తి సింగారం రవీంద్రగుప్త, డోర్నకల్ గుగులోత్ పార్వతీనాయక్, నర్సంపేట డా.గుండాల మదన్ కుమార్, వరంగల్ ఈస్ట్ –చిత్రపు పుష్పిత లయ, వర్ధన్నపేట డా.వడ్డేపల్లి విజయ్ కుమార్, ములుగు భూక్యా జంపన్న నాయక్, మహబూబాబాద్‌కు గుగులోత్ శంకర్ నాయక్‌లను బీఎస్పీ అభ్యర్థులుగా ప్రకటించారు. ఇదిలా ఉంటే మరో రెండు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా.. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ సహా మిగతా పార్టీలు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని ఆయా పార్టీల వర్గాల ద్వారా తెలుస్తోంది. అభ్యర్థుల తంతు ముగిస్తే ప్రచారంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించవచ్చని ఆయా పార్టీల అగ్రనేతలు భావిస్తున్నట్లు కూడా చెబుతున్నారు. ఏదేమైనా ఇప్పటికే ప్రధాన పార్టీల అగ్రనేతల ప్రచారాలతో హీటెక్కిన ఓరుగల్లు.. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత మరింత హోరెత్తనుంది.

ఇప్పటికే హీటెక్కిన ఓరుగల్లు... ఓ దఫా సాగిన అగ్రనేతల ప్రచారం

అధికార పార్టీ, ప్రతిపక్షాల హాట్ కామెంట్లతో ఇప్పటికే ఉమ్మడి వరంగల్ హీటెక్కింది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే జనగామ, వర్ధన్నపేట, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభల పేరిట హోరెత్తించిన గులాబీ దళపతి, సీఎం కేసీఆర్.. నోటిఫికేషన్ తర్వాత కూడా ఉమ్మడి జిల్లాలో ప్రచారం నిర్వహించనున్నారు. ఈ నెల 3న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. ఇప్పటికే నియోజకవర్గాలను ఒక దఫా చుట్టేసిన సీఎం కేసీఆర్, భవిష్యత్‌లో నిర్వహించే సభలను మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఆదివాసీ జిల్లాలైన ములుగు, జేఎస్ భూపాలపల్లిను ఎంచుకున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, టీపీసీసీ, సీఎల్పీ నేతలు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క తదితరులు రామప్ప నుంచి ప్రజా బస్సుయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రచారసభలకు భారీగా జనం తరలగా ఆరు గ్యారంటీల అమలుకు హామీ ఇచ్చారు. బీజేపీ కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, రూపాలా, జాతీయ, రాష్ట్ర నాయకుల పర్యటనలు కూడా ఓ దఫా ముగిశాయి. నోటిఫికేషన్ తర్వాత మరోమారు భారీ పర్యటనలకు ప్లాన్ చేస్తున్నారు. బీఎస్పీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తదితర పార్టీలు అభ్యర్థులను ప్రకటించి ప్రచారం చేపట్టాయి. నోటిఫికేషన్ తర్వాత ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు.. స్వతంత్రులు ఎన్నికల బరిలో నిలవనున్నారు.

ఎన్నికల సిబ్బంది సందేహాలు నివృత్తి చేసుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న అశ్విని తానాజీ వాకాడే

మామునూరు: ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారులు, సిబ్బంది ప్రధాన భూమిక పోషిస్తారని, ఏదైన సందేహాలుంటే శిక్షణ శిబిరంలోనే నివృత్తి చేసుకోవాలని వర్ధన్నపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అశ్విని తానాజీ వాకాడే సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ శిబిరానికి 334 మంది ప్రిసైడింగ్(పీ.ఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ (ఏ.పీ.ఓ) అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎన్నికల శిక్షణ శిబిరాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఎన్నికల సిబ్బందికి ఎలాంటి సందేహాలున్న నివృత్తి చేసుకోవాలని చెప్పారు. నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలి విడత ట్రైనింగ్‌ను అందజేయడం జరుగుతుందని, బ్యాలెట్, కంట్రోలింగ్ యూనిట్, వీవీ ప్యాట్‌ల అమరిక తదితర అంశాల గురించి అధికారులు సంపూర్ణ అవగాహన ఏర్పర్చుకోవాలని, బాధ్యత యుతంగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, 2వ, 3వ, దఫాలలో శిక్షణ నిర్వహిస్తామని అన్నారు. పీ.ఓలకు సెక్టార్ ఆఫీసర్స్ పూర్తి సహకారం అందజేస్తామని ఆర్.ఓ తెలిపారు.

ఎన్నికల్లో పోలింగ్ అధికారుల పాత్ర కీలకం

- ఆర్డీఓ కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

నర్సంపేట రూరల్: ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకమని నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి అన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం బిట్స్ కళాశాలలో ప్రారంభించారు. మొత్తం 721 పోలింగ్ సిబ్బందికి మొదటి రోజు 370మంది పీఓలు, 8మంది ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి బాలకృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రెసిడింగ్ అధికారులు, సహాయ ప్రెసిడింగ్ అధికారుల పాత్ర కీలకమని, ఎన్నికల సంఘం రూపొందించిన పుస్తకంపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. నియమాలను పాటించాలని ఎన్నికల సంఘం జారీ చేస్తున్న నూతన నిబంధనల ప్రకారం ఎన్నికలను నిర్వహించాలని, ఎన్నికలపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్‌కు ఒక్క రోజు ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, విధులపై స్పష్టత ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నోడల్ అధికారి కిరణ్‌కుమార్, తహసీల్దార్, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేయాలి

నల్లబెల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికలు సమర్థవంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాటు పూర్తి చేయాలని నర్సంపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కృష్ణవేణి అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. పోలింగ్ స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన కనీస సౌకర్యాలను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ రాజేష్, బీఎల్‌ఓలు ఉన్నారు.

అధిక సాంద్రత పద్ధతి సాగుతో మేలు



పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

గీసుకొండ: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంట సాగు చేయడం వల్ల రైతులకు కూలీల ఖర్చుతోపాటు పంటకాలం తగ్గుతుందని, ఎక్కువ దిగుబడి వస్తుందని వ్యవసాయ విస్తరణ అధికారి మహేందర్ తెలిపారు. మంగళవారం పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు, వ్యవసాయ శాఖ, వరంగల్, నూజివీడు విత్తన సంస్థ ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగుపై మండలంలోని అనంతారం గ్రామంలో ధనికుల వెంకటేశ్వర్లు పంటలో క్షేత్రస్థాయి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం విస్తరణ అధికారి డాక్టర్ మహేందర్, జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రొగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ హరిప్రసాద్, ఏఈఓ అఖిల ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్ మాట్లాడుతూ అధిక సాంద్రతతోపత్తి పంట సాగు చేయడం వలన గులాబీ రంగు పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకోవచ్చని, దీని నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నూజివీడు విత్తన మేనేజర్ మురళి, సేల్స్ ఆఫీసర్ నాగరాజు, ఎంఏ బావుసింగ్, రైతు కోఆర్డినేటర్ నర్సింహులు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి బీజేపీతో సాధ్యం

- కేంద్ర మాజీ మంత్రి పొన్ను రాధాకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణన్

నర్సంపేట: రాష్ట్ర అభివృద్ధి కోసం బీజేపీకే ఓటు వేయాలని కర్ణాటక ఎమ్మెల్సీ గోపినాథ్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పొన్ను రాధాకృష్ణ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని నిర్ణయం తీసుకున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. పార్టీ కోసం కార్యకర్తలు సమష్టిగా పని చేసి నర్సంపేట గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. తెలంగాణలో ఈ ఎన్నికల్లో డబుల్ ఇంజన్ సర్కారు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నర్సంపేట బీజేపీ ఎమ్మెల్యే టిక్కెట్ నర్సంపేట ప్రాంతానికి చెందిన కార్యకర్తకే ఇస్తామని తెలిపారు. ఈ ఎన్నికలు.. పార్లమెంట్ ఎన్నికలకు పునాది అన్నారు. ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవ్ ఆత్మహత్యకు కాలేజీ యాజమాన్యానిదే బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నర్సంపేట: హైదరాబాద్‌లోని చైతన్యపురి నారాయణ కాలేజీ ఇంటర్ విద్యార్థి వైభవ్ ఆత్మహత్యకు నారాయణ కాలేజీ యాజమాన్యమే బాధ్యత వహించాలని, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఏబీఎస్‌ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, ఏబీఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్, ఏఐఎఫ్‌డీఎస్ డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అల్వాల నరేష్ మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలకు నారాయణ, శ్రీచైతన్య లాంటి కార్పొరేట్ కాలేజీలు నిలయంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల వద్ద లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ, మార్కులు, ర్యాంకుల పేరు తో తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేస్తూ విద్యార్థుల శవాలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఆత్మహత్య చేసుకున్న వైభవ్ కుటుంబానికి న్యాయం చేయాలని, రాష్ట్రంలో కొనసాగుతున్న కార్పొరేట్ విద్యా సంస్థలను మూసి వేయాలని డిమాండ్ చేశారు. సిద్ధు, రాము, ప్రశాంత్, సిద్దార్థ, రమేష్, శ్రీకాంత్, రాజేష్, నవీన్ ఉన్నారు.

ఈసీ నిబంధనల మేరకు ప్రచారం చేయాలి

వరంగల్ అర్బన్ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని తూర్పు రిటర్నింగ్ అధికారి, గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల ప్రచార శైలిని తూర్పు రిటర్నింగ్ అధికారి, గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా మంగళవారం క్షుణ్ణంగా పరిశీలించారు. వరంగల్ లేబర్ కాలనీ, క్రిస్టియన్ కాలనీల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.

జాగ్రత్తగా నామినేషన్లు సమర్పించాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- పార్టీల ప్రతినిధులతో సమావేశం



రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించడమే కాకుండా అఫిడవిట్‌లో ఏ ఒక్క కాలంను ఖాళీగా ఉంచొద్దని వరంగల్ ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నామినేషన్‌ల ప్రక్రియ, సువిధ ఆప్ ద్వారా ఆన్‌లైన్‌లో అభ్యర్థి నామినేషన్ వేసిన అఫిడవిట్ వివరాలు పొందుపరచడం, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ తదితర అంశాలతోపాటు ఎన్నికల సంఘం నిబంధనల గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల ప్రకారం నామినేషన్ కేంద్రాల ఏర్పాట్లు, నామినేషన్ పత్రాలు పూరించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మార్గదర్శకాలను పాటించాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 81,719 కొత్త ఎపిక్ కార్డులు రాగా ఇప్పటికే 50 వేలకు పైగా పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓటర్ల జాబితాలో 519 మంది ఉన్నారని చెబుతూ సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ) ద్వారా ఓటు హక్కు వినియోగం గురించి వివరించారు. ఈ సమావేశంలో వరంగల్ ఆర్డీఓ వాసుచంద్ర, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ విశ్వనారాయణ, జగదీష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణను వినియోగించుకోవాలి

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. వరంగల్ ఎల్‌బీ కళాశాలలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని మంగళవారం తూర్పు రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్‌బాషాతో కలిసి సందర్శించి శిక్షణ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు గానూ 2036 మందిని నియమించగా తూర్పునకు 981 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించి మూడు రోజులపాటు బ్యాచ్‌ల వారీగా తొలివిడత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని, ఎన్నికల సంఘం జారీ చేస్తున్న నూతన నిబంధనల ప్రకారం ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగులు, సిబ్బంది పార్టీలకు, అభ్యర్థులకు అనుబంధంగా ఉండకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ రోజు, ముందు రోజు చేయాల్సిన పనులకు సంబంధించి చెక్‌లిస్టు తయారు చేసుకుని విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ సందర్భంగా ప్రతీ పీఓ తీసుకోవాల్సిన సామగ్రి, పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శించాల్సిన సామగ్రి, మాక్ పోల్, ఈవీఎం, వీవీ ప్యాట్‌లను ఎలా అనుసంధానం చేయాలనే విషయంపై ఒకటికి రెండు సార్లు చదవాలని తెలిపారు. పోలింగ్ రోజు పోలింగ్ ప్రారంభానికి ముందు అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించాలని తెలిపా రు. ఓటు వేయడానికి వచ్చిన వారి వద్ద ఎపిక్ కా ర్డు, ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఉండేలా చూ డాలన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, మొదటిరోజు గైర్హాజరైన వారు మరుసటి రోజు తప్పనిసరిగా హాజరుకాని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, మాస్టర్ ట్రైనీ సందీప్‌కుమార్, డీఎస్‌ఓ వేణుగోపాల్, సూపరింటెండెంట్ హబీబ్, డీటీ మధుసూదన్ పాల్గొన్నారు.

నిట్‌లో ఖాదీ మహోత్సవ్

కాజీపేట అర్బన్ : నిట్‌లో ఖాదీ మహోత్సవ్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) సౌజన్యంతో ఖాదీ మహోత్సవ్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ప్రారంభించి మాట్లాడారు. నేటితరానికి ఖాదీ వస్త్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో తయారు చేసిన వివిధ రకాల వస్తువులపై అవగాహన కల్పించేందుకు ఖాదీ మహోత్సవ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఘన్‌పూర్.. బిగ్‌వార్

- స్టేషన్‌ఘన్‌పూర్‌లో గెలుపొందిన పార్టీదే పై చేయి అని నానుడి
- రెండు జిల్లాల పరిధిలో నియోజకవర్గం

ఎన్నికలు.. డబ్బుమయం

- ప్రస్తుతం నైతిక విలువలు లేవు
- మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు

ప్రభుత్వ ఉద్యోగులూ తస్మాత్ జాగ్రత్త

- ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా
- పార్టీల ప్రచారాల్లో పాల్గొంటే చర్యలు

- వివరాలు 10లో ▸

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



నల్లబెల్లిలో అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నల్లబెల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను డీడబ్ల్యూఓ శారద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో విద్యను నేర్పించాలని సూచించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని టీచర్లకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సీడీపీఓ రాధిక, ఏసీడీపీఓ విద్య, సూపర్‌వైజర్‌లు శామల, శ్రీదేవి, జయ గ్రూపులుగా ఏర్పడి మండలంలోని శనిగరం, ముచ్చింపుల, రంగాపురం, రుద్రగూడెం, నారక్కపేటతో పాటు పలు గ్రామాల్లోని అంగన్ వాడీ కేంద్రాను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు.

ఉత్సాహంగా 2కే రన్



రన్‌లో పాల్గొన్న సీపీ, పోలీస్ అధికారులు

వరంగల్ క్రైం: జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా జెండా ఊపి ప్రారంభించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి అశోకా జంక్షన్ మీదుగా తిరిగి కమిషనరేట్ కార్యాలయం వరకు నిర్వహించిన ఈ పరుగులో పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సంస్థానాలన్నీ ఒక తాటిపై తీసుకొచ్చి భారతదేశంగా మార్చడంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ కీలకంగా నిలిచారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా మెలిగితే శాంతిభద్రతల సమస్యలు తలెత్తవన్నారు. పరుగులో ఉత్సాహంగా పాల్గొన్న వారికి సీపీ అభినందనలు తెలిపారు. అనంతరం జాతీయ ఐక్యతను కాపాడుతామని అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. డీసీపీలు దాసరి మురళీధర్, రవీందర్, అబ్దుల్ బారి, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటల్లో రెండో స్థానంలో నిలిస్తే రజిత పథకం దక్కుతుంది. కానీ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిస్తే ఇక తెరమరుగే..

- రిచర్డ్ నిక్సన్



ఈ ముచ్చటెరుకేనా?

ప్రభుత్వ ఉద్యోగులూ తస్మాత్ జాగ్రత్త..

భూపాలపల్లి అర్బన్: ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా నాయకులు ఓటర్లను ప్రభావితం చేసేలా ఏ పనులు చేసినా కఠినంగా వ్యవహరించనుంది. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులు కూడా ప్రచారాలకు దూరంగా ఉండాలి. లేని పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. ఈ నేపథ్యంలో ప్రతి నియోజకవర్గంలో కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థలు ఏర్పాటు చేసింది. వీడియో సర్వేలెన్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలను ఏర్పాటు చేసింది. రాజకీయ పార్టీల ప్రచార సమయంలో వీడియో రికార్డింగ్ పకడ్బందీగా చేయిస్తోంది. ఇలా చేసిన రికార్డింగ్‌ను పరిశీలన బృంద అధికారులు ఎప్పటికప్పుడు వీక్షిస్తుంటారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రచారంలో పాల్గొన్నట్లు గమనిస్తే ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. సంఘం ఆదేశాలతో సంబంధిత అధికారులపై వేటు వేయడం లేదా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటారు. అదే విధంగా సామాజిక మాధ్యమాలను కూడా మీడియా మానిటరింగ్ బృందం అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. పార్టీలకు అనుకూలం, ప్రతికూలంగా పోస్టులు పెట్టినా ఎన్నికల చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుంది. ఒక పార్టీకి అనుకూలంగా ఉన్నారని ఇటీవలే జిల్లాస్థాయి అధికారులపై కూడా ఎన్నికల సంఘం వేటు వేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ అధికారులు ప్రచారంలో ప్రత్యక్షం, పరోక్షంగా పాల్గొన్నా.. ఏ రాజకీయ పార్టీకి మద్దతుగా వ్యవహరించినా ఆధారాలు లభిస్తే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యులు కావాల్సి వస్తుంది. కేవలం కేటాయించిన విధులకు మాత్రమే అధికారులు పరిమితమైతే ఏ ఇబ్బందులు ఉండవు.

నిబంధనలు ఇవీ..

- ప్రభుత్వ ఉద్యోగులు పార్టీల ప్రచారాల్లో పాల్గొనొద్దు
- పార్టీల కండువాలు కప్పుకోవడం నిషేధం
- సామాజిక మాధ్యమాల్లో పార్టీలకు అనుకూలంగా పోస్టులు పెట్టొద్దు
- ఓటర్లకు కూడా ఫలానా పార్టీకి ఓటు వేయాలని సూచన చేయొద్దు
- పార్టీల ప్రచారంలో ప్రత్యక్షం, పరోక్షంగానూ పాల్గొనొద్దు
- ఓటర్లను ప్రభావితం చేసేలా ఎలాంటి పనులు చేయొద్దు

జంగ్ తెలంగాణ

'సోషల్' వారియర్స్..

ప్రస్తుతం సోషల్ మీడియా వినియోగం విస్తృతంగా మారింది. ఏదైనా అంశాన్ని సోషల్ మీడియాలో (వాట్సాప్, ఎక్స్(ట్విట్టర్),ఫేస్‌బుక్) పోస్టు చేస్తే క్షణాల్లో వైరలై కావాల్సినంత పబ్లిసిటీ వస్తోంది. అలాగే, సోషల్ మీడియా ద్వారా రాత్రికిరాత్రే స్టార్ అయిన వాళ్లు కోకొల్లలు. దీంతో మండలంలోని ఓ పార్టీకి చెందిన నాయకులు సోషల్ మీడియాలో తమ పార్టీ అభ్యర్థి మరింత ఫోకస్ కావాలని వారియర్స్‌కు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు అందజేశారు. తమ అభ్యర్థి, పార్టీ కార్యక్రమాలు ఉవ్వెత్తున ప్రచారం చేయాలని దిశానిర్దేశం చేశారని సమాచారం.

- ఏటూరునాగారం



ఘన్‌పూర్.. బిగ్‌వార్

స్టేషన్‌ఘన్‌పూర్‌లో గెలుపొందిన పార్టీదే రాష్ట్రంలో అధికారమనే నానుడి

- రెండు జిల్లాల పరిధిలో నియోజకవర్గం
- పునర్విభజన తర్వాత 3 సార్లు బీఆర్‌ఎస్‌కే పట్టం
- కాంగ్రెస్ 6, బీఆర్‌ఎస్–4, టీడీపీ 3 సార్లు విజయం
- బీజేపీకి ఒక్కసారి కూడా దక్కని అవకాశం



స్టేషన్‌ఘన్‌పూర్ : స్టేషన్‌ఘన్‌పూర్.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఓ వైపు జాతీయ రహదారి.. మరో వైపు రైలు మార్గంతో రాష్ట్ర నలుమూలల నుంచి సులువైన రవాణా సౌకర్యం ఉండి వ్యాపార, వాణిజ్య పరంగా జనగామ జిల్లాలో కీలకంగా వెలుగొందుతోంది. దీంతో ఈ ప్రాంతంలో పాగా వేయడానికి వివిధ పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతాయి. 1978లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్ అయింది. సాధారణంగా ఇక్కడి నుంచి గెలిచిన పార్టే రాష్ట్రంలో అధికారంలోకి వస్తోంది అనే నానుడి ఉంది. 1957లో నియోజకవర్గం ఏర్పడగా ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో నియోజకవర్గం 4 సార్లు జనరల్‌గా ఉంది. అయితే 2009లో నియోజకవర్గం పునర్విభజన అయినా రిజర్వేషన్ మారలేదు. కడియం శ్రీహరి, డాక్టర్ తాటి కొండ రాజయ్య ఎక్కువ సార్లు గెలుపొందారు. 1957 నుంచి 1972 వరకు జరిగిన ఎన్నికల్లో సీపీఐ రెండు సార్లు గెలుపొందగా కాంగ్రెస్ పార్టీ నుంచి 1957లో బేతి కేశవరెడ్డి, 1972లో హయగ్రీవాచారి గెలుపొందారు. మొత్తం 6 సార్లు కాంగ్రెస్ పార్టీ గెలిచింది. టీడీపీ నుంచి 4 సార్లు కడియం శ్రీహరి గెలుపొందారు.

స్థానికేతరులకు పట్టం..

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్ అయిన తర్వాత 1978 నుంచి 1999 వరకు ఇక్కడి ప్రజలు స్థానికేతరులకు పట్టం కట్టారు. 1978–83లో గోకా రామస్వామి(కాంగ్రెస్), 1985లో బొజ్జపల్లి రాజయ్య (టీడీపీ), 1989లో ఆరోగ్యం (కాంగ్రెస్), 1994, 99 సాధారణ ఎన్నికలతో పాటు 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో కడియం శ్రీహరి టీడీపీ నుంచి గెలుపొందారు.

పునర్విభజన నుంచి స్థానికుడు..

2009లో నియోజకవర్గం పునర్విభజన కాగా 2009, 2014, 2018 సాధారణ ఎన్నికలు, 2012 ఉప ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు స్థానికుడికే పట్టం కట్టారు. 2009లో కాంగ్రెస్ నుంచి, 2014, 2018 సాధారణ, 2012 ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన డాక్టర్ తాటికొండ రాజయ్య వరుసగా నాలుగు సార్లు ఎన్నికయ్యారు.

మంత్రులుగా పనిచేసింది వీరే..

స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి 1994, 99 సాధారణ ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలుపొందిన కడియం శ్రీహరి పదేళ్లు మంత్రిగా పనిచేశారు. తెలంగాణ ఆవిర్భావ సమయంలో 2004లో బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన డాక్టర్ గుండె విజయరామారావు మంత్రిగా పనిచేశారు. 2012 ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన డాక్టర్ రాజయ్య వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా పనిచేశారు. రాజయ్యను డిప్యూటీ సీఎంగా బర్తరఫ్ చేసిన అనంతరం కడియం శ్రీహరి డిప్యూటీ సీఎంగా పనిచేశారు.

వ్యవధి	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ఓట్లు	ప్రత్యర్థి	పార్టీ	ఓట్లు
1957-62	బేతి కేశవరెడ్డి	కాంగ్రెస్	16,900	సీఆర్‌కే రెడ్డి	పీడీఎఫ్	11,345
1962-67	కుల్లా మోహన్‌రావు	సీపీఐ	16,831	జీకే రెడ్డి	కాంగ్రెస్	14,246
1967-72	తోకల లక్ష్మారెడ్డి	సీపీఐ	20,536	హయగ్రీవాచారి	కాంగ్రెస్	17,280
1972-78	హయగ్రీవాచారి	కాంగ్రెస్	31,664	కమలాదేవి	సీపీఐ	19,692
1978-83	గోక రామస్వామి	కాంగ్రెస్	38,857	లింగయ్య	జనతా	18,486
1983-85	గోక రామస్వామి	కాంగ్రెస్	23,970	సుదర్శన్‌రావు	టీడీపీ	23,196
1985-89	బొజ్జపల్లి రాజయ్య	టీడీపీ	37,449	ఆనందం	కాంగ్రెస్	18,236
1989-94	బి.ఆరోగ్యం	కాంగ్రెస్	38,572	బి.రాజయ్య	టీడీపీ	33,046
1994-99	కడియం శ్రీహరి	టీడీపీ	62,407	ఆరోగ్యం	కాంగ్రెస్	23,356
1999-2004	కడియం శ్రీహరి	టీడీపీ	50,080	టి.రాజయ్య	కాంగ్రెస్	45,520
2004-2008	విజయరామారావు	బీఆర్‌ఎస్	63,221	శ్రీహరి	టీడీపీ	43,501
2008-2009	శ్రీహరి	టీడీపీ	39,663	టి.రాజయ్య	కాంగ్రెస్	35,545
2009-2012	టి.రాజయ్య	కాంగ్రెస్	63,187	శ్రీహరి	టీడీపీ	56,593
2012-2014	టి.రాజయ్య	బీఆర్‌ఎస్	81,279	శ్రీహరి	టీడీపీ	48,641
2014-2018	టి.రాజయ్య	బీఆర్‌ఎస్	1,34,089	జీవీఆర్	కాంగ్రెస్	44,802
2018-2023	టి.రాజయ్య	బీఆర్‌ఎస్	98,612	ఎస్.ఇందిర	కాంగ్రెస్	62,828

1957లో ఏర్పడిన నియోజకవర్గం..

ఘన్‌పూర్, ధర్మసాగర్, జఫర్‌గఢ్ మండలాలతో 1957లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం జనరల్‌గా ఏర్పడింది. 1978 నుంచి ఎస్సీ రిజర్వ్‌గా అవే మూడు మండలాలతో ఉంది. పునర్విభజన అనంతరం ఘన్‌పూర్, జఫర్‌గఢ్, ధర్మసాగర్, లింగాలఘణపురం, రఘునాథపల్లి మండలాలతో నియోజకవర్గంగా ఏర్పడింది. జనగామ జిల్లా ఏర్పడిన అనంతరం ఈ ఐదు మండలాలతో పాటు వేలేరు, చిల్పూరు మండలాలు కలిశాయి. దీంతో ప్రస్తుతం నియోజకవర్గం జనగామ, హనుమకొండ జిల్లాల పరిధి విస్తరించి ఉంది.

మహిళా ఓట్లు అధికం..

ఘన్‌పూర్ నియోజకవర్గంలో 2,42, 981 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓట్లు 1,22,132, పురుషుల ఓట్లు 1,20,848 ఉన్నాయి. ట్రాన్స్‌జెండర్ ఓటు ఒకటి ఉంది. నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలున్నాయి.

ఎన్నికలు.. డబ్బు మయం

ప్రస్తుతం సంపాదనే ప్రధాన ధ్యేయం

- నైతిక విలువలు శూన్యం
- అప్పటి రాజకీయాల్లో విలువలు
- మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు


వన్నాల శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే

హన్మకొండ: ప్రస్తుతం ఎన్నికలు డబ్బు మయమయ్యాయని, ప్రలోభాల పర్వం పెరిగిందని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు వన్నాల శ్రీరాములు అన్నారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన వన్నాల శ్రీరాములు రాజకీయాల్లో అత్యంత సీనియర్ నాయకుడు. మారకుండా ఒకే పార్టీలో కొనసాగుతున్న విలువలు కలిగిన నాయకుడు. పార్టీ అవకాశాలు ఇచ్చినా.. ఇవ్వకున్నా నమ్ముకున్న అందులోనే తన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం, ప్రస్తుత రాజకీయాలపై మంగళవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అప్పటి రాజకీయాల్లో విలువలు

1985లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగి గెలుపొందా. అప్పటి రాజకీయాల్లో విలువలుండేవి. ఇప్పుడు అధ్వానంగా తయారయ్యాయి. నైతిక విలువలు లేవు. ఇప్పటి ఎన్నికల్లో డబ్బు, మద్యం కీలకమయ్యాయి. చివరకు రాజకీయ పార్టీలు కూడా ధనబలం ఉన్న వారికే టికెట్లు ఇచ్చే దుస్థితికి చేరుకున్నాయి. బీజేపీలో ధన బలాన్ని పట్టించుకోరు. ఇతర పార్టీల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలు అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. ఒక్కో ఎమ్మెల్యే రూ.వెయ్యి కోట్ల సంపాదన ధ్యేయంగా పెట్టుకుంటున్నారు. కబ్జాలు పెరిగాయి. అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో అవినీతి పెరిగింది. నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిజాయితీగా పని చేసే వారు.

వర్ధన్నపేటలో ప్రత్యేక పరిస్థితులు..

వర్ధన్నపేట నియోజకవర్గంలో ప్రత్యేక పరిస్థితులుండేవి. దొరల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. కొందరు దొరల ఇంటి ముందు నుంచి వెళ్లాలంటే చెప్పులు విడిచి చేత పట్టుకుని వెళ్లే వారు. ఇలాంటి పరిస్థితుల్లో నేను ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించా. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో ఉన్నా. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న సమయంలో విద్యార్థి యూనియన్ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా పోటీ చేసి విజయం సాధించా. కాజీపేట నిట్‌లో ఎంటెక్ చివరి సంవత్సరం చదువుతున్న సమయంలో 1972లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో వర్ధన్నపేట నుంచి జనసంఘ్ అభ్యర్థిగా మొదటి సారిగా చట్టసభకు పోటీ చేశా. అప్పుడు రూ.10 వేలు ఖర్చు అయింది. జనసంఘ్ సీనియర్ నాయకుడు నారాయణదాస్ చందాలు పోగు చేసి రూ.10 వేలు ఖర్చులకు ఇచ్చారు.

జీప్‌కు రోజుకు రూ.100 కిరాయి

ఒక్క జీప్‌లో ఎన్నికల ప్రచారం చేశా. జీప్‌కు రోజుకు రూ.100 కిరాయి చెల్లించేవాళ్లం. అయితే ఈ ఎన్నికల్లో ఓడిపోయా. అనంతరం 1974లో వర్ధన్నపేట సమితి ప్రెసిడెట్‌గా పోటీ చేసి ఓటమి పొందా. 1983లో మరోసారి బీజేపీ అభ్యర్థిగా శాసన సభకు పోటీ చేసి ఓటమి చెందా. అప్పుడు రూ.2 లక్షల వరకు ఖర్చు వచ్చింది. ఆ ఎన్నికల్లో ప్రచారానికి మాజీ ప్రధాని, అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు వాజ్‌పేయి వర్ధన్నపేటకు వచ్చారు. 1985లో శాసన సభకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ నుంచి మరోసారి పోటీ చేసి విజయం సాధించా. అప్పుడు రూ.3 లక్షల వరకు ఖర్చు వచ్చింది.

ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం..

1977లో వచ్చిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేశా. ఆ సమయంలో అజ్ఞాతంలోకి వెళ్లి పోరాడా. అరెస్టు చేసి జైలుకు పంపారు. 3 నెలలు జైలు జీవితం గడిపా.

ముగ్గులు పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



ఓటు.. ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టు

హనుమకొండ కలెక్టరేట్ ఎదుట మంగళవారం వివిధ శాఖల మహిళా ఉద్యోగులు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించగా ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా పాల్గొన్నారు. ప్రజాస్వామ్యానికి కీలకమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చైతన్యం కల్పించాలన్నారు.

- హన్మకొండ అర్బన్

రూ. 5 లక్షల నగదు పట్టివేత..



వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి బాలసముద్రంలో కారులో తరలిస్తున్న రూ.5 లక్షల నగదు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జి.మధుసూదన్ మంగళవారం తెలిపారు. సుదమల్ల సురేందర్ తన కారులో ఆధారం లేకుండా తీసుకెళ్తున్న రూ.5 లక్షల నగదును సీజ్ చేసి సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు.

వర్ధన్నపేట రూ.60వేలు..

వర్ధన్నపేట: వర్ధన్నపేట పరిధి డీసీ తండా వద్ద మంగళవారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఇందులో తొర్రూరు నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న వరంగల్‌కు చెందిన అప్పని ఉదయ్‌కుమార్ కారును తనిఖీ చేయగా రూ.60 వేలు లభ్యమయ్యాయి. డబ్బుకు సంబంధించి ఆధారం లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.


వర్ధన్నపేట: స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

గుండెపోటుతో పెరోల్ ఖైదీ మృతి


ఉబ్బని వీరన్న (ఫైల్)

కురవి: హత్య కేసులో శిక్ష అనుభవిస్తూ పెరోల్‌పై విడుదలైన ఉబ్బని వీరన్న(40) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. సీరోలు ఎస్సై ఎం.రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నల్లెల్ల గ్రామానికి చెందిన ఉబ్బని వీరన్న 2007, అక్టోబర్ 8వ తేదీన అదే గ్రామంలో కన్న తల్లి ముత్తమ్మ, అన్న ఉబ్బని రాములును హత్య చేశాడు. ఈ కేసులో అతడికి 2008లో జీవితఖైదు పడింది. చర్లపల్లి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 18వ తేదీన జైలు నుంచి పెరోల్‌పై బయటకు వచ్చి స్వగ్రామానికి చేరుకున్నాడు. తన ఇంటి వద్ద చిన్నమ్మతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో వీరన్నకు ఛాతీలో నొప్పి వస్తుందని చెబుతూ చనిపోయినట్లు మృతుడి సోదరి దోమల వెంకటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాదేవి తెలిపారు. శవపంచనామా చేసి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

నీటి తొట్టిలో పడి బాలుడు..


సోనేశ్వర్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఇంటి ఆవరణలో ఆడుకుంటూ వెళ్లిన ఓ బాలుడు.. నీటి తొట్టిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ మండలం సాదు తండా జీపీ పరిధిలోని యాబు తండాలో జరిగింది. కురవి పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్య సుమన్, లలిత దంపతులకు సుశాంత్, సోనేశ్వర్ (5) ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు సోనేశ్వర్ వారి ఇంటి ఆవరణలో ఆడుకుంటూ వెళ్లి అక్కడే ఉన్న నీటి తొట్టిలో పడ్డాడు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా కొంత సమయం వరకు ఈ ఘటనను ఎవరూ గమనించలేదు. ఈ క్రమంలో అటువైపు వచ్చిన స్థానికులు చూసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతిచెందాడని ధ్రువీకరించారు. ఈ ఘటనపై సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


మల్లికార్జున్(ఫైల్)

కాశిబుగ్గ: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం వరంగల్ రైల్వే స్టేషన్ బి క్యాబిన్ సమీపంలో జరిగింది. నగరంలోని కాశిబుగ్గ వివేకానందకాలనీకి చెందిన మాటేటి మల్లికార్జున్ (45) గోల్డ్ స్మిత్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే కొన్ని నెలలుగా పని చేయకుండా ఖాళీగా ఉంటున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కె. భాస్కర్ కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అందజేశామని జీఆర్పీ సీఐ నరేష్ తెలిపారు. మృతుడికి భార్య గోపిలత, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

మాందారిపేటలో వివాహిత..

శాయంపేట: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వివాహిత.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని మాందారిపేటలో జరిగింది. గ్రామానికి చెందిన లోకలబోయిన జ్యోతి(32) కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. భర్త నాగరాజు రోజు మద్యం సేవించి భార్య జ్యోతితో తరుచూ గొడవ పడేవాడు. దీంతో మనస్తాపానికి గురైన జ్యోతి.. నాగరాజు మంగళవారం కూలీకి వెళ్లగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహ్యతకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

14.5 కిలోల గంజాయి పట్టివేత


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట: గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి 14.5 కిలోల శుద్ధి చేసిన గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని ఎక్సైజ్ సీఐ చంద్ర మోహన్ తెలిపారు. కాజీపేట ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు కాజీపేట రైల్వే జంక్షన్ ప్రాంతంలో ఎక్సైజ్ సిబ్బంది మాటువేసింది. ఈ క్రమంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రాధేశ్యాం అనే యువకుడు విజయవాడలో గంజాయి కొనుగోలు చేసి తన రాష్ట్రానికి వెళ్లడానికి రైలు కోసం వేచి చూస్తుండగా పట్టుకుని తనిఖీ చేయగా 14.50 కిలోల గంజాయి లభించింది. దీంతో రాధేశ్యాంను అరెస్టు చేసి రిమాండ్ తరలించామని ఎక్సైజ్ సీఐ తెలిపారు. జిల్లా అధికారి చంద్రశేఖర్, ఎస్సైలు తిరుపతి, సౌమ్య, ఖలీల్, కోటిలింగం, వీరమల్లు, రషీద్, లాలయ్య, వెంకటరమణ, రవీందర్ పాల్గొన్నారు.

జనగామలో 10 కేజీలు..

జనగామ రూరల్: జనగామ రైల్వేస్టేషన్ ప్రాంతంలో సోమవారం తనిఖీలు నిర్వహించగా బిహార్‌కు చెందిన కుమార్ వ్యక్తి వద్ద 10 కేజీల ఎండు గంజాయి లభించింది. దీంతో అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎక్సైజ్ సీఐ ప్రభావతి తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ. 2.50 లక్షల వరకు ఉంటుందన్నారు. ఎస్సైలు జనార్దన్, రాధిక, సిబ్బంది ఖలీల్, శ్రావణ్ పాల్గొన్నారు.

భర్తను చంపిన కేసులో భార్య, ప్రియుడి అరెస్టు


అరెస్టు చూపుతున్న సీఐ ఫణిధర్

గూడూరు: మండలంలోని దుబ్బగూడెం గ్రామానికి చెందిన అజ్మీర రవి వారం క్రితం విద్యుదాఘాతంతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మృతుడి తల్లి హచాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపి నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మృతుడి భార్య కవిత అదే గ్రామానికి చెందిన అజ్మీర శివకుమార్‌తో 7 సంవత్సరాల నుంచి వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయంలో దంపతులు మధ్య గొడవలు జరగగా పెద్ద మనుషులు పంచాయితీ నిర్వహించారు. అయినా కవిత తీరు మారలేదు. ఎలాగైనా రవి చంపాలని ప్రియుడితో కలిసి పథకం వేసింది. అనుకున్నదే తడవుగా తమ పొలంలో సరఫరా అవుతున్న విద్యుత్ తీగలు వేసింది. ఇదీ గమనించకుండా రవి పురుగుల మందు పిచికారీ చేస్తూ తీగలు తాకి షాక్‌కు గురై మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టగా ప్రియుడి మోజులో పడి తన భర్త హత్య చేసినట్లు కవిత అంగీకరించింది. దీంతో ఇద్దరి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని సీఐ ఫణిధర్, ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.